సాక్షి
పశ్చిమగోదావరి

ఆదివారం । 9 । ఫిబ్రవరి । 2025



12 నుంచి బధిరుల క్రికెట్

భీమవరంలో ఈనెల 12, 13వ తేదీల్లో 5వ రాష్ట్రస్థాయి బధిరుల టీ-20 క్రికెట్ చాంపియన్‌షిప్ పోటీలు నిర్వహించనున్నారు. 8లో ▸



పెళ్లి వద్దు.. సంపాదన ముద్దు

పెళ్లి వయసు దాటిపోతున్నా.. యువత మాత్రం అప్పుడే పెళ్లి వద్దు.. జీవితంలో సెటిల్ అయ్యాక చేసుకుంటాం అంటున్నారు. 8లో ▸



శ్రీవారి క్షేత్రంలో పెళ్లి సందడి

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రంలో శనివారం భారీగా వివాహాలు జరిగాయి. ఆలయ అనివేటి మండపం, పాత కల్యాణ మండప ప్రాంతాలు వేదికలయ్యాయి.

న్యూస్‌రీల్

అంతర్వేది ఉత్సవాల రద్దీ



యాత్రికులతో కిటకిటలాడుతున్న పంటు

నరసాపురం: అంతర్వేది ఉత్సవాల నేపథ్యంలో నరసాపురంలో శనివారం రద్దీ పెరిగింది. స్వామి వారి రథోత్సవం కావడంతో భక్తులు పెద్దెత్తున తరలివెళ్లారు. వేకువజామున కల్యాణోత్సవాన్ని తిలకించి భక్తుల తిరుగు ప్రయాణంతో పట్టణంలోని గోదావరి పంటు రేవు కిటకిటలాడింది. భక్తుల సౌకర్యార్థం మూడు పంటులు ఏర్పాటు చేశారు. స్టీమర్‌రోడ్డు పొడవునా స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ నాయకులు భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ చేశారు. ఎమ్మెల్యే బొమ్మిడి నాయకర్, కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బారాయుడు, టీడీపీ ఇన్‌చార్జ్ పొత్తూరి రామ రాజు వేర్వేరుగా పులిహోర పంపిణీ చేశారు. సత్యసాయి సేవా సమితి మజ్జిగ అందించారు.

మద్యం షాపులకు 476 దరఖాస్తులు

భీమవరం: గీత కులాలకు ప్రభుత్వం కేటాయించిన మద్యం షాపుల కోసం ఆఖరి రోజు శనివారం భారీగా దరఖాస్తులు వచ్చాయి. ఇప్పటికే జిల్లాలో 175 షాపులు ఏర్పాటుచేయగా గీత కులాల వారికి మరో 18 షాపులు కేటాయించారు. వీటి కేటాయింపునకు గతనెల 25న నోటిఫికేషన్ జారీచేసి, 27 నుంచి ఆన్‌లైన్, హైబ్రిడ్ విధానాల్లో దరఖాస్తులకు అవకాశం కల్పించారు. దరఖాస్తుదారులు తిరిగి ఇవ్వని పద్ధతిలో రూ.2 లక్షల రుసుం చెల్లించాల్సి ఉంది. ఫిబ్రవరి 5 వరకు దరఖాస్తులకు అవకాశం ఇచ్చినా ఆశించిన స్థాయిలో దరఖాస్తులు రాక పోవడంతో 8వ తేదీ వరకు పొడిగించారు. 7వ తేదీ వరకు 113 దరఖాస్తులు అందగా చివరి రోజు భారీగా దరఖాస్తులు అందాయని, మొత్తం 476 దరఖాస్తులు వచ్చినట్టు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి ఆర్ఎస్ కుమరేశ్వరణ్ చెప్పారు. ఈనెల 10న భీమవరం కలెక్టరేట్‌లో షాపులకు లాటరీ నిర్వహించి కేటాయిస్తామన్నారు.

పెనుగొండ పీఠాధిపతి పట్టాభిషేకం



బాలాస్వామికి కిరీటధారణ చేస్తున్న పీఠాధిపతులు

పెనుగొండ: పెనుగొండ క్షేత్ర పీఠాధిపతిగా శ్రీ ప్రజ్ఞానంద సరస్వతీ స్వామీజీ (బాలా స్వామి) పట్టాభిషిక్తులు అయ్యారు. అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో వాసవీ శాంతి ధాంలో శనివారం ఉదయం ప్రత్యేక పూజలు, వాసవీ హోమం నిర్వహించారు. అనంతరం ప్రజ్ఞానంద స్వామిజీకి వేద మంత్రోచ్ఛరణలతో కర్ణాటకకు చెందిన పీఠాధిపతులు శ్రీ స్వామి స్వయం ప్రకాశ సచ్చిదానంద సరస్వతి, వామనాశ్రమ స్వామీజీ, చిదానంద గిరి స్వామిజీ, మంగళగిరి యోగాశ్రమ పీఠాధిపతి వెంకటేశ్వర యోగ స్వామిజీలు బాలా స్వామికి కిరీట ధారణ గావించి పట్టాభిషిక్తులు చేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు డాక్టర్ పీఎస్ గోవిందరాజు శింగోలు (రాజదండం) అందించారు. ట్రస్ట్ ఈసీ సభ్యులు పాల్గొన్నారు.

ఎన్నికల కోడ్ జాడేది?



ఆకివీడులో టీడీపీ జెండాలు

సాక్షి టాస్క్‌ఫోర్స్: గ్రాడ్యుయేట్ ఎన్నికల కోడ్ అమలు ఆకివీడు మండలంలో కనిపించడం లేదు. అన్ని పార్టీల జెండాలు, విగ్రహాలు, ఫ్లెక్సీలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయి. కోడ్‌ను కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రకటించినా ఇక్కడ అమలుజేసే నాథుడే కరువయ్యాడు.

నీటి అవసరాలపై ప్రణాళికలు

భీమవరం(ప్రకాశం చౌక్): జిల్లాలో వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నీటి అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించి, తాగునీటి కొరత లేకుండా ముందస్తు ప్రణాళికలు చేపట్టినట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ఈ మేరకు ముందస్తు ఏర్పాటుకు సూచనలిచ్చారు. పెండింగ్‌లో ఉన్న తాగునీటి సరఫరా పనులను పూర్తి చేయాలన్నారు. జిల్లాలో ప్రస్తుతం అధిక నీటి ఎద్దడి పరిస్థితులు లేకున్నా.. వేసవి దృష్ట్యా ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. జల్‌జీవన్ మిషన్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు.

ప్రగతి.. అధోగతి

పశ్చిమగోదావరి జిల్లాకు తలమానికంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మంజూరు చేసిన మెడికల్ కళాశాల, ఆక్వా వర్సిటీ పనులకు కూటమి సర్కారు నిర్లక్ష్య గ్రహణం పట్టింది. ఇప్పటికే మెడికల్ కళాశాల నిర్మాణాలు నిలిచిపోగా ఆక్వా వర్సిటీ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జిల్లాకు కీలకమైన ఈ రెండు అభివృద్ధి పనులపై కూటమి ప్రజాప్రతినిధులు పట్టనట్టు వ్యవహరిస్తుండటం గమనార్హం.



నరసాపురంలో నత్తనడకన సాగుతున్న ఆక్వా వర్సిటీ భవన నిర్మాణ పనులు

జాడలేని అభివృద్ధి

- అర్ధాంతరంగా నిలిచిన ప్రభుత్వ మెడికల్ కళాశాల పనులు
- సామగ్రిని తరలించుకుపోయిన నిర్మాణ సంస్థ
- ఆక్వా వర్సిటీకి నిర్లక్ష్య గ్రహణం
- జిల్లాకు రూ.575 కోట్లతో వైద్య కళాశాల, ఆక్వా వర్సిటీ మంజూరు చేసిన గత ప్రభుత్వం
- అప్పట్లోనే రూ.114 కోట్ల విలువైన పనులు పూర్తి



పాలకొల్లులో అసంపూర్తిగా ఉన్న మెడికల్ కళాశాల భవన నిర్మాణాలు

సాక్షి, భీమవరం: పేద విద్యార్థులకు వైద్య విద్యను చేరువ చేయడం, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించే లక్ష్యంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జిల్లాకు మెడికల్ కళాశాలను మంజూరు చేశారు. రూ.475 కోట్ల వ్యయంతో పాలకొల్లు మండలం దగ్గులూరు వద్ద సుమారు 60 ఎకరాల విస్తీర్ణంలో 16 బ్లాకులుగా కళాశాల భవన నిర్మాణ పనులు చేపట్టారు. ఇన్ పేషెంట్, అవుట్ పేషెంట్, ఎమర్జెన్సీ సేవల బ్లాకులకు సంబంధించి సుమారు రూ.74.5 కోట్ల విలువైన పనులు పూర్తయ్యాయి. పాలకొల్లులో మెడికల్ కళాశాల ద్వారా ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందడంతో పాటు పాలకొల్లు, నరసాపురం, ఆచంట నియోజకవర్గాల్లోని పలు గ్రామాలు అభివృద్ధి చెంది ఎందరికో ఉపాధి లభిస్తుందని అంతా భావించారు. పనులు నిలిచిపోవడం వారి ఆశలపై నీళ్లు చల్లినట్లయ్యింది.

పనులు పూర్తయిన మేర బిల్లులు చెల్లింపు చేయక పోవడంతో కొద్దినెలలుగా నిర్మాణ సంస్థ పనులను నిలిపివేసింది. స్థలంలోని ఐరెన్, ఇసుక, కంకర, ఇతర నిర్మాణ సామగ్రిని వేరే ప్రాంతానికి తరలించుకుపోతోంది. గత ప్రభుత్వంలో ఎమ్మెల్యే హోదాలో తరచూ మెడికల్ కళాశాల నిర్మాణ స్థలం వద్దకు వచ్చి హడావుడి చేసిన నిమ్మల రామానాయుడు కూటమి ప్రభుత్వంలో మంత్రి అయ్యాక అటువైపు కన్నెత్తి చూడలేదన్న విమర్శలు ఉన్నాయి.

'ఆక్వా'ంక్షలు ఫలించలేదు : ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.53 లక్షల ఎకరాల ఆక్వా సాగు ఉంది. జిల్లాలో 15కు పైగా ప్రాసెస్ ప్రాసెసింగ్ ప్లాంట్లద్వారా రొయ్యలు విదేశాలకు ఎగుమతి అవుతున్నాయి. చేపలు, రొయ్యల మేతలు, చెరువుల నిర్వహణ సామగ్రి అమ్మకాలు, పట్టుబడి, ప్రాసెసింగ్ ప్లాంట్లు, రవాణా తదితర రూపాల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా లక్షలాది మంది ఈ రంగంపై ఆధారపడి జీవిస్తున్నారు. ఆక్వా రంగాన్ని ప్రోత్సహించే దిశగా గత ప్రభుత్వం జిల్లాకు ఆక్వా వర్సిటీని మంజూరు చేసింది. యూనివర్సిటీ కోసం నరసాపురం పక్కనే గల లిఖితపూడిలో 40 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, క్యాంపస్ కాలేజీ, బాయ్స్, గరల్స్ హాస్టల్ భవన నిర్మాణాల కోసం రూ.100 కోట్లు మంజూరు చేశారు. తాత్కాలికంగా నరసాపురంలోని తుఫాన్ షెల్టర్ భవనంలో గతేడాది నవంబరు నుంచి 66 సీట్లతో బ్యాచిలర్ ఆఫ్ ఫిషరీ సైన్స్ తరగతులను ప్రారంభించారు. నెల్లూరు జిల్లా ముత్తుకూరులో 1992లో క్యాంపస్ కళాశాల ప్రారంభించగా నరసాపురంలోని కళాశాల రాష్ట్రంలోనే రెండోవది.

నత్తనడకన పనులు

2023 నవంబరులో పనులు ప్రారంభం కాగా ఏడాదిన్నరలోపు పనులు పూర్తిచేయాలన్నది లక్ష్యంగా నిర్ణయించారు. ఈ మేరకు గత ప్రభుత్వంలోనే అడ్మినిస్ట్రేటివ్, కళాశాల భవనాలకు సంబంధించి పనులు శ్లాబ్ దశకు చేరుకోగా బాయ్స్, గరల్స్ హాస్టల్ భవనాలకు పునాదులు పూర్తయ్యాయి. ఇప్పటివరకు రూ.40 కోట్ల విలువైన పనులు మాత్రమే జరిగాయి. కూటమి ప్రభుత్వంలో బిల్లుల విడుదలలో జరుగుతున్న తాత్సారంతో పనులు మందగించాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో కేటాయింపులను బట్టి పనులు చేయనున్నట్టు నిర్మాణ వర్గాలు చెబుతున్నాయి.

చిత్తశుద్ధితో పనిచేయాలి



మెడికల్ కళాశాల ద్వారా పాలకొల్లు, పరిసర ప్రాంతాలు ఎంతో అభివృద్ధి చెందుతాయి. నిర్మాణ పనులు పూర్తయితే గత ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న భయంతో ఇప్పటి పాలకులు ఉన్నారు. చిత్తశుద్ధితో త్వరితగతిన పనులు పూర్తిచేసే దిశగా ప్రభుత్వం మెడికల్ కళాశాల పనులు చేపట్టాలి.

– గుడాల శ్రీహరిగోపాలరావు, వైఎస్సార్‌సీపీ పాలకొల్లు నియోజకవర్గ ఇన్‌చార్జి

ప్రభుత్వ నిర్లక్ష్యంతోనే..



జిల్లాలో ఆక్వా రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో నాటి సీఎం జగన్ ఆక్వా వర్సిటీని మంజూరు చేశారు. ఇప్పటికే భవన నిర్మాణాలు పూర్తయి వర్సిటీలో కార్యకలాపాలు మొదలు కావాల్సి ఉంది. ఈ ప్రభుత్వ నిర్లక్ష్యంతో పనులు ముందుకు సాగక ఇంకా నిర్మాణ దశలోనే ఉన్నాయి. ఆక్వా రైతులకు మేలు చేసేలా త్వరితగతిన ఆక్వా వర్సిటీ పనులు పూర్తిచేయాలి.

– ముదునూరి ప్రసాదరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు



యువత.. ఉత్సాహ భరిత



విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు.. సాంస్కృతిక కార్యక్రమాలతో భళా అనిపించారు. తాడేపల్లిగూడెంలోని ఏపీ నిట్‌లో ఉల్కాన్జీ-2025 వేడుకలు శనివారం సాయంత్రం ముగిశాయి. నిట్ ఇన్‌చార్జి డైరెక్టర్ ఎన్‌వీ రమణరావు మాట్లాడుతూ దేశాన్ని నడిపించే సాంకేతిక రథసారథులు విద్యార్థులు అన్నారు. చదువుతో పాటు ఆటపాటలు, కళలను మనసు పెట్టి సాధన చేయాలన్నారు. దేశం గర్వించే స్థాయిలో పరిశోధనలు ఉండాలన్నారు. జీబీ వీరేష్‌కుమార్, తలారీ రేష్మా, రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

– తాడేపల్లిగూడెం



ఇళ్లు పీకారు.. వాహనాలకు చోటిచ్చారు



ఆకివీడులో ఆక్రమణలు తొలగించిన స్థలంలో వాహనాలను నిలిపిన దృశ్యం

ఆకివీడు: ఆక్రమణల పేరుతో పేదల ఇళ్లను పీకేసి అదే ప్రాంతంలో వాహనాల నిలుపుదలకు స్థలం కేటాయించడం విమర్శలకు తావిస్తోంది. స్థానిక అయిభీమవరం రోడ్డులోని మూలలంక పంట బోదెను ఆనుకుని రోడ్డు మార్జిన్, కాలువ గట్టు మార్జిన్లలో 40 ఏళ్లగా గుడిసెలు వేసుకుని జీవిస్తున్నవారిని ఇటీవల ఇళ్లు ఖాళీ చేయించారు. అయితే ఈ ప్రాంతం ఆటోలు, ఐషర్ వ్యాన్లు, ఇతర వ్యాన్లకు స్టాండ్‌గా మారిపోయింది. వాహనాల నుంచి లీకయ్యే ఆయిల్ పంట కాలువలోకి వెళ్లి ప్రమాదకరంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. స్థానిక నాయకుల ప్రోద్బలంతోనే స్టాండ్ ఏర్పడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఆక్రమణల తొలగించిన ఈ ప్రాంతాన్ని పార్కుగా అభివృద్ధి చేస్తామని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణంరాజు ప్రకటించారు. అయితే ఇందుకు విరుద్ధంగా వాహనాల స్టాండ్ ఏర్పడటంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

రాష్ట్రంపై చంద్రగ్రహణ క్రీనీడలు



పీవీఎల్ నర్సింహరాజు

ఆకివీడు: బామ్మ నొక్కినా.. బాబు మాత్రం బటన్ నొక్కలేకపోతున్నారని వైఎస్సార్‌సీపీ ఉండి నియోజకవర్గ ఇన్‌చార్జి పీవీఎల్ నర్సింహరాజు ఎద్దేవా చేశారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం తీరు ఏరు దాటిన తర్వాత తెప్ప తగలేసినట్టుగా ఉందని విమర్శించారు. శనివారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పేదరికం నుంచి ప్రజలు కోలుకుంటున్న తరుణంలో చంద్రగ్రహణ క్రీనీడలు కమ్ముకున్నాయన్నారు. అభివృద్ధి, సంక్షేమం జాడే లేదని, రాష్ట్రం అప్పుల్లో అభివృద్ధి చెందుతోందని విమర్శించారు. సూపర్ సిక్స్ హామీలు అమలుజేయలేక సీఎం చంద్రబాబు విలవిల్లాడుతున్నారన్నారు. సంపద సృష్టిస్తామని ప్రజలపై బాదుడే బాదుడుగా భారం వేస్తున్నారని ధ్వజమెత్తారు. బాబు షూరిటీ.. భవిష్యత్ గారడీగా ఉందన్నారు. కొత్త ఉద్యోగుల మాట దేవుడెరుగు వందలాది మంది మల్టీపర్పస్ హెల్త్ అసిస్టెంట్ పోస్టుల్ని, వేలాది మంది వలంటీర్లను తొలగించారన్నారు. సచివాలయ ఉద్యోగుల కుదింపు, సీహెచ్‌సీల్లో కళ్లజోళ్ల పథకం వంటి వాటిని తొలగించారన్నారు. పేద విద్యార్థులకు భరోసాగా నిలిచే ఫీజు రీయింబర్స్‌మెంట్ ఊసేలేదన్నారు. ఎన్నికల ముందు భూసర్వేపై తప్పుడు అపోహలు సృష్టించి ప్రజలను భయభ్రాంతులకు గురిచేసిన చంద్రబాబు ఇప్పుడు సర్వేలకు తెరలేపారని విమర్శించారు. రీసర్వేల పేరుతో రైతుల్ని దోచుకుంటున్నారని ధ్వజమెత్తారు. జగన్ అమలు చేసిన పథకాల్లో ఒక్కటైనా బాబు అమలు చేస్తున్నారా అని నిలదీశారు. చంద్రబాబు కూటమి ప్రభుత్వం నవమాసాల్లో ఈర్ష్య, ద్వేషాలు, కక్ష సాధింపులు, కుతంత్రాలతో పాలన సాగిస్తోందని పీవీఎల్ మండిపడ్డారు.

'నవోదయ' ప్రవేశ పరీక్షలు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జవహర్ నవోదయ విద్యాలయాల్లో 2025-26 విద్యా సంవత్సరానికిగాను 9, 11 తరగతుల్లో ప్రవేశాలకు శనివారం నిర్వహించిన పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 11.15 గంటల నుంచి మధ్యాహ్నం 1.45 గంటల వరకు నాలుగు కేంద్రాల్లో జరిగిన 9వ తరగతి పరీక్షలకు 1,007 మంది విద్యార్థులకుగా 302 మంది హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి 1.30 గంటల వరకు రెండు కేంద్రాల్లో నిర్వహించిన 11వ తరగతి పరీక్షకు 653 మందికి 189 మంది హాజరయ్యారు. డీఈఓ ఎం.వెంకటలక్ష్మమ్మ రెండు కేంద్రాల్లో, పెదవేగి జవహర్ నవోదయ విద్యాలయ ప్రిన్సిపల్ ఆరు కేంద్రాల్లో, ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు ఆరు కేంద్రాలను తనిఖీ చేశారు.

సముద్ర తాబేళ్ల పరిరక్షణకు చర్యలు

ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ నాయక్



మాట్లాడుతున్న నాయక్

నెల్లూరు(అర్బన్): సముద్ర తాబేళ్ల పరిరక్షణకు స్వచ్ఛంద సంస్థలు, మత్స్య, మెరైన్ తదితర శాఖల సమన్వయంతో యాక్షన్ ప్లాన్‌ను సిద్ధం చేశామని రాష్ట్ర అటవీ శాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ ఏకే నాయక్ తెలిపారు. తాబేళ్ల అవసరం, వాటిని కాపాడుకోవడం అనే అంశంపై వివిధ జిల్లాల అటవీశాఖ అధికారులు, ట్రీ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో శనివారం నెల్లూరులోని వీపీఆర్ కన్వెన్షన్ సెంటర్‌లో వర్క్‌షాపు నిర్వహించారు. నాయక్ మాట్లాడుతూ ఇటీవల తీరంలో 2 వేల నుంచి 3 వేల వరకు తాబేళ్లు మృతి చెందాయన్నారు. దీనికి ప్రధాన కారణం మత్స్యకారులు సముద్రంలో వారికి కేటాయించిన దూరం వెళ్లకుండా భారీ యంత్రాలతో కూడిన బోట్లను, మెకనైజ్డ్ వలలను వాడటమే కారణమన్నారు. సముద్రంలో నుంచి గుడ్లు పెట్టేందుకు తీరంలోకి వస్తున్న తాబేళ్లు ఆ వలలో పడి మృత్యువాత పడుతున్నాయన్నారు. తాబేళ్లతో సముద్రంలో జీవ సమతుల్యత ఏర్పడుతుందన్నారు. అలాంటి జీవులను కాపాడుకోకపోతే మత్స్య సంపదకు కూడా ముప్పు వస్తుందన్నారు. మత్స్యకారులు తీరం సమీపంలో వేట చేయరాదని, దూరం వెళ్లి వేట సాగించాలన్నారు. సంప్రదాయ బోట్లను మాత్రమే వాడాలన్నారు. ఈ మేరకు మత్స్యకారులను చైతన్యం చేయాలన్నారు. ప్రణాళికాబద్ధంగా రాష్ట్ర వ్యాప్తంగా చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. తాబేళ్లను పట్టుకుని అక్రమంగా తరలిస్తే కేసులు నమోదు చేయిస్తామన్నారు. తాబేళ్ల రక్షణకు తీసుకోవాల్సిన చర్యలపై ఫారెస్ట్, ఇతర శాఖల అధికారులు జిల్లాల వారీగా చర్చలు జరిపారు. ఏలూరు, బాపట్ల తదితర జిల్లాల ఫారెస్ట్ అధికారులు, మత్స్యశాఖ అధికారులు, ఇండియన్ కోస్ట్ గార్డు, మెరైన్ పోలీసు తదితరులు పాల్గొన్నారు.

గోదావరిలో నీటిస్థాయి పరిశీలన



మ్యాప్‌ను పరిశీలిస్తున్న జీఆర్ఎంబీ చైర్మన్ ప్రధాన్

పోలవరం రూరల్: గోదావరి నది పరీవాహక ప్రాంతంలో వాటర్ లెవెల్స్‌ను జీఆర్ఎంబీ చైర్మన్ ఏక ప్రధాన్ శనివారం పరిశీలించారు. పోలవరం ప్రాజెక్టు ప్రాంతంలో నీటిస్థాయిలు, డయాఫ్రమ్ వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యామ్‌లను పరిశీలించారు. పనులు జరుగుతున్న తీరును ఇంజనీరింగ్ అధికారుల నుంచి తెలుసుకున్నారు. ఆయకట్టు పరిధిలో ఎన్ని లిఫ్టులు ఉన్నాయి, ఎన్ని పంటలకు నీరు అందిస్తున్నారు అనే విషయాలను తెలుసుకున్నారు. ముందుగా తాడిపూడి, చింతలపూడి ఎత్తిపోతల పథకాలను పరిశీలించినట్టు అధికారులు తెలిపారు. ఆయన వెంట జీఆర్ఎంబీ మెంబర్ సెక్రటరీ అగస్త్యన్, డీఈ సత్యదేవ్, రామేశ్వరనాయుడు, జేఈ భద్రరావు తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ ప్రాక్టికల్స్


ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు జిల్లాలో శనివారం ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. 31 కేంద్రాల్లో 4,545 మంది ఒకేషనల్ విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం షిఫ్ట్‌లో 2,450 మందికి 2,386 మంది, మధ్యాహ్నం షిఫ్ట్‌లో 2,253 మందికి 2,159 మంది హాజరయ్యారని ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.యోహాన్ తెలిపారు.

వరుడైన నారసింహుడు

సుందరగిరిపై కల్యాణోత్సవాలు



వేడుకలో డీఈఓ, సూపరింటెండెంట్



పెండ్లి ముస్తాబు చేస్తున్న పండితులు

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల చినవెంకన్న దేవస్థానం దత్తత ఆలయం ఐఎస్ జగన్నాథపురం సుందరగిరిపై కొలువైన స్వయంభూ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. భీష్మ ఏకాదశిని పురస్కరించుకుని శనివారం ఉదయం స్వామివారు పెండ్లి కుమారుడిగా, కనకవల్లీ, లక్ష్మి అమ్మవార్లు పెండ్లి కుమార్తెలుగా ముస్తాబయ్యారు. ముందుగా ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన ప్రత్యేక వేదికపై స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను ఉంచి విశేష పుష్పాలంకారాలు చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేద మంత్రోచ్ఛరణల నడుమ పెండ్లి ముస్తాబు తంతు జరిపించారు. ఆలయ డీఈఓ బాబురావు పట్టువస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఆలయంలో విష్వక్సేన పూజ, పుణ్యాహవాచన, రుత్విగ్వరణ, అంకురార్పణ, కలశస్థాపన, ధ్వజారోహణ, అగ్నిప్రతిష్టాపన వేడుకలు జరిగాయి. వేలాది మంది భక్తులు తరలివచ్చారు. గోపాలపురం ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పాల్గొన్నారు. దేవస్థానం సూపరింటెండెంట్లు రమణ రాజు, దుర్గాప్రసాద్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఉత్సవాల్లో నేడు : ఉదయం 8 గంటల నుంచి.. నిత్య హోమాలు, మూలమంత్ర హవనాలు, బలిహరణ, వేద పారాయణ, ఔపోసన, మండప పూజలు, హారతి, మంత్ర పుష్పాల సమర్పణ.

- సాయంత్రం 6 గంటల నుంచి.. మూలమంత్ర హవనాలు, బలిహరణలు, హారతి, మంత్రపుష్పాల సమర్పణ.
- సాంస్కృతిక కార్యక్రమం.. రాత్రి 7 గంటల నుంచి కూచిపూడి నృత్య ప్రదర్శనలు.

క్లుప్తంగా

పందిరిపల్లిగూడెంలో శిలాఫలకం ధ్వంసం



పందిరిపల్లిగూడెం పాఠశాల వద్ద ధ్వంసం చేసిన శిలాఫలకం

కైకలూరు: కూటమి ప్రభుత్వంలో కక్షసాధింపు చర్యలు కొనసాగుతూనే ఉన్నాయి. కైకలూరు మండలం పందిరిపల్లిగూడెం నుంచి గుమ్మళ్లపాడు వెళ్ళే రహదారిలో ప్రభుత్వ పాఠశాల వద్ద శిలాఫలాకాన్ని గుర్తు తెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. ఈ శిలాఫలకాన్ని సీసీ రోడ్డు నిర్మాణ ప్రారంభోత్సవం రోజున 2023 ఆగస్టు 25న అప్పటి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు(డీఎన్నార్) ఆవిష్కరించారు. కొల్లేరు గ్రామాల్లో పలు వీధులలో సీసీ రోడ్ల నిర్మాణాలు పెద్ద ఎత్తున జరిగాయి. అభివృద్ధిని చూసి ఓర్వలేక కొందరు రాత్రి సమయాల్లో శిలాఫకాలను ధ్వంసం చేస్తున్నారు.

12 నుంచి బధిరుల క్రికెట్ పోటీలు



భీమవరంలో బధిరుల క్రికెట్ పోటీల బ్యానర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

భీమవరం: వెస్ట్ గోదావరి జిల్లా స్పోర్ట్స్ ఫెడరేషన్ ఆఫ్ డెఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో భీమవరంలో ఈ నెల 12, 13 తేదీల్లో 5వ రాష్ట్రస్థాయి బధిరుల టీ20 క్రికెట్ చాంపియన్ షిప్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ గౌరవాధ్యక్షుడుడు చెరుకువాడ రంగసాయి, అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు భూపతిరాజు మురళీ కృష్ణంరాజు, సీహెచ్ తాతారావు, గన్నాబత్తుల తులసమ్మ పెదతాత చారిటబుల్ ట్రస్ట్‌కు చెందిన గన్నాబత్తుల శ్రీనివాస్ చెప్పారు. శనివారం భీమవరంలో క్రికెట్ పోటీల బ్రోచర్, బ్యానర్ ఆవిష్కరించిన సందర్భంగా వివరాలు వెల్లడించారు. డీఎన్నార్ కళాశాల వద్ద గన్నాబత్తుల క్రీడ మైదానంలో రెండు రోజులపాటు నిర్వహించే పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 10 టీంలు పాల్గొంటున్నాయన్నారు.

పెళ్లి వద్దు.. సంపాదన ముద్దు

- మారిన యూత్ మైండ్ సెట్
- లేటు వయసులో పెళ్లితో ఆరోగ్య సమస్యలు
- ఐవీఎఫ్ సెంటర్ల చుట్టూ తిరుగుతున్న జంటలు

సండే స్పెషల్



ఏ వయసులో జరగాల్సిన ముచ్చట ఆ వయసులో జరగాలి అంటుంటారు. అయితే ఇప్పుడు పెళ్లి వయసు దాటిపోతున్నా.. యువత మాత్రం అప్పుడే పెళ్లి వద్దు.. జీవితంలో సెటిల్ అయ్యాక చేసుకుంటాం అంటున్నారు. ఇంతలో మూడు పదుల వయసు దాటిపోతోంది. ఉద్యోగాల వేట, దాలర్ల భ్రమతో లేటు వయసు పెళ్లిళ్లకు మొగ్గు చూపుతున్నారు. జీవితంలో ఎంజాయ్ చేశాకే పెళ్లి అన్న ధోరణితో అసలుకే మోసం వస్తోంది. సరైన సమయంలో పెళ్లి చేసుకోకపోవడంతో సంతానం కోసం ఐవీఎఫ్ కేంద్రాలకు పరుగు పెడుతున్నారు. పలు రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారు. ఇక అబ్బాయిలకైతే అమ్మాయిలు దొరక్క అవివాహితులుగా మిగిలిపోతున్నారు.

–తాడేపల్లిగూడెం

అమ్మాయిల ట్రెండ్ మారింది

తరం మారింది. అబ్బాయిలే కాదు.. అమ్మాయిలు కూడా మూడు పదులు దాటినా పెళ్లి చేసుకోవడం లేదు. 35 ఏళ్ల దాటే వరకు యువతకు పెళ్లి ఆలోచనలు లేకపోవడం చాలా అనర్థాలకు దారితీస్తోంది. పెళ్లి చేసుకుంటాను.. ఇపుడే కాదు .. ఉద్యోగంలో స్థిరపడ్డాక చేసుకుంటాం.. ఇలా అనుకొనేసరికి వయస్సు 35 సంవత్సరాలు దాటుతోంది. అప్పుడు మేరేజ్ బ్యూరోలో వివరాల నమోదు చేయించుకుంటున్నారు. తీరా పెళ్లయ్యాక పిల్లలను కనే వయసు దాటిపోతుంది. మహిళల్లో ఆధునిక జీవన విధానాలతో 40 ఏళ్లకే మెనోపాజ్ వస్తుంది. రక్తహీనత, ఐరన్‌లోపం, విటమిన్ డీ లోపాలు ఏర్పడుతున్నాయి. దీంతో జంటలు ఐవీఎఫ్ కేంద్రాలను ఆశ్రయిస్తున్నారు.

పెళ్లికాని ప్రసాదులే కాదు.. అమ్మాయిలు కూడా

జిల్లాలో 18 నుంచి 39 సంవత్సరాల వయసున్న యువత 6,88,555 మంది
వారిలో 18 నుంచి 19 ఏళ్లు- 32,277 మంది
20 నుంచి 29 ఏళ్లు- 2,57,495 మంది,
30 నుంచి 39 ఏళ్లు- 3,98,783 మంది
యువకులు 3,42,643 మంది కాగా..
యువతులు 3,45,912 మంది ఉన్నారు.
వీరిలో సుమారు నాలుగు లక్షల మందికి ఇంకా వివాహాలు కాలేదని లెక్కలు చెబుతున్నాయి.

61 శాతం జంటల్లో హార్మోన్ సమస్యలు

పిల్లలు వద్దు.. ఆదాయమే ముద్దు అనే పాశ్చాత్య దేశాల కల్చర్ మన యువతను కమ్మేస్తోంది. ముందు జీవితాన్ని ఎంజాయ్ చేద్దాం అన్న ధోరణి పెరుగుతోంది. అనధికారిక లెక్కల ప్రకారం వివాహమైన నేటి తరం జంటల్లో 61 శాతం హార్మోన్ సమస్యలు ఉంటున్నాయి.

పెళ్లి ట్రెండ్ మారింది



జీవితంలో వివాహం ముఖ్య ఘట్టం. ఇప్పుడు ఉద్యోగ వ్యవస్థ వివాహ స్వరూపాన్ని మార్చేసింది. ఇగోలు పెరిగి వివాహ బంధం విచ్ఛిన్నమవుతుంది. వయసు రాగానే పెళ్లి చేసుకోవడం మేలు. అనురాగం, ఆప్యాయతల నడుమ ఈ పెళ్లిళ్లు సాగాలి.

– భోగిరెడ్డి ఆదిలక్ష్మి, స్పందన ఫౌండేషన్,

లేటు వివాహాలు అనర్థదాయకం



పెళ్లి ఆలస్యంగా చేసుకోవడం అనర్థం. ఇన్‌ఫెర్టిలిటీ పెరుగుతుంది. స్పెర్మ్ వైటాలిటీ తగ్గుతుంది. బీపీ, మధుమేహం వంటివి వస్తున్నాయి. బర్త్ రేటు తగ్గుతుంది. పుట్టిన పిల్లల్లో క్రోమోజోముల అసమతుల్యంతో వైకల్యం రావచ్చు. సహజీవనం , ఇతర మార్గాలలో సంబంధాలు పెట్టుకోవడం వల్ల సుఖ వ్యాధులు, హెచ్ఐవీ రిస్క్ పెరుగుతుంది. జనరేషన్ గ్యాప్ ఏర్పడి ఇబ్బందులు తలెత్తుతాయి. 23 నుంచి 30 సంవత్సరాలలోపు పెళ్లిళ్లు చేసుకోవాలి.

డాక్టర్ తాతారావు, గూడెం ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్

23 ఏళ్లకే పెళ్లి చేయాలి



వైద్య శాస్త్రం ప్రకారం 23 ఏళ్లకే ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేయాలి. గర్భధారణకు సరైన సమయం 27 ఏళ్లు. తర్వాత పెళ్లిళ్లు జరిగితే అబార్షన్ ప్రమాదం ఉంది. డౌన్ సిండ్రోమ్ సమస్య రావచ్చు. స్థూలకాయం, బీపీ, మధుమేహం వంటి వ్యాధుల ప్రమాదం ఉంటుంది. గుండె , శ్వాసకోశ సంబంధ వ్యాధులు పెరిగే అవకాశం ఉంది. ప్రసవానికి ముందు రక్తస్రావం జరగవచ్చు. లేటు వయసులో కాన్పు వల్ల అమ్మాయిలు ఏన్నో సమస్యలు ఎదుర్కొంటారు.

–డాక్టర్ పద్మ, ఏరియా ఆసుపత్రి, తాడేపల్లిగూడెం

శ్రీవారి క్షేత్రం.. భక్తజన సంద్రం



భక్తులతో నిండిన దర్శనం క్యూలైన్లు

ద్వారకాతిరుమల: చినవెంకన్న దివ్య క్షేత్రం శనివారం భక్తజన సంద్రమైంది. శ్రీవారికి ప్రీతికరమైన రోజు, అందులోనూ భీష్మ ఏకాదశి పర్వదినం, రెండో శనివారం కావడంతో వేలాది మంది భక్తులు స్వామివారిని దర్శించారు. తెల్లవారుజామునుంచే భక్తుల రాక మొదలవడంతో ఆలయ పరిసరాలు సందడిగా మారాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్, దర్శనం క్యూలైన్లతో పాటు, అనివేటి మండపం, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, కల్యాణకట్ట ఇలా అన్ని విభాగాలు భక్తులతో పోటెత్తాయి. స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించేందుకు పెద్ద ఎత్తున భక్తులు అన్నదాన భవనం వద్ద బారులు తీరారు. భక్తుల వాహనాలు భారీగా కొండపైకి చేరడంతో ఘాట్ రోడ్లలో ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

23 మందిపై కేసులు

నరసాపురం: పట్టణంలోని అరుందతీపేటలో శుక్రవారం జరిగిన ఘర్షణ ఘటనలో ఇరువర్గాలకు చెందిన 23 మందిపై కేసులు నమోదు చేసినట్లు టౌన్ ఎస్సై సీహెచ్ జయలక్ష్మి చెప్పారు. గురువారం రాత్రి రోడ్డుపై ఇరువర్గాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన చిన్న గొడవ ఇరువర్గాలు కర్రలు, కత్తులు, రాళ్లతో దాడి చేసుకునే వరకూ వెళ్లింది. ఓ వర్గం వ్యక్తులు బైక్‌పై వెళుతుండగా, మరోవర్గం వారు దారి ఇవ్వకుండా రోడ్డుకు అడ్డంగా ఉన్నారని ఆరోపించారు. కావాలనే బైక్ హారన్ పెద్దగా కొట్టి రెచ్చగొట్టారని మరో వర్గం ఆరోపించింది. ఈ నేపథ్యంలో ఇరు వర్గాలు బాహాబాహీకి సిద్ధపడ్డాయి.

శ్రీవారి చెంతకు పాదయాత్రగా..



దొరసానిపాడు మీదుగా క్షేత్రానికి పాదయాత్రగా వస్తున్న భక్తులు



పాదయాత్ర భక్తులకు టీ అందిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం నుంచి 10 వేల మంది భక్తులు రాక

ద్వారకాతిరుమల/జంగారెడ్డిగూడెం: జంగారెడ్డిగూడెం నుంచి సుమారు 10 వేల మంది భక్తులు ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రానికి శనివారం పాదయాత్రగా విచ్చేశారు. ప్రతి ఏటా లాగే మాఘ శుద్ధ ఏకాదశి పర్వదినాన్ని పురస్కరించుకుని జంగారెడ్డిగూడెంలోని గంగానమ్మ అమ్మవారి ఆలయం వద్ద తెల్లవారుజామున 4 గంటలకు తమ యాత్రను ప్రారంభించినట్టు హిందూధర్మ ప్రచార సమితి సభ్యుడు మురళీకృష్ణ తెలిపారు. మధ్యలో పలువురు దాతలు పాదయాత్ర భక్తులకు టీ, పాలు, అల్పాహారాన్ని అందజేశారు. పెద్ద ఎత్తున మహిళలు, యువకులు ఇందులో పాల్గొన్నారు. వారంతా వెంకటాపురం మీదుగా ద్వారకాతిరుమల కొండపైన క్షేత్రపాలకుడి ఆలయానికి ఉదయం 9 గంటల సమయంలో చేరుకుని, శివదేవుడిని దర్శించారు. అనంతరం శ్రీవారి ఆలయానికి చేరుకుని స్వామి, అమ్మవార్లను దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ తరువాత స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. హిందూధర్మాన్ని పరిరక్షించే క్రమంలో తామంతా ప్రతి ఏటా భీష్మ ఏకాదశి పర్వదినాన ద్వారకాతిరుమల క్షేత్రానికి పాదయాత్రగా వస్తున్నట్లు మురళీకృష్ణ తెలిపారు.

విర్డ్‌లో క్యాన్సర్ శస్త్రచికిత్సలు

ద్వారకాతిరుమల: విర్డ్ ఆస్పత్రిలో ఎముకల క్యాన్సర్ శస్త్రచికిత్సలు శనివారం ప్రారంభించినట్టు ఆస్పత్రి ట్రస్ట్ ఛైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. ఇకపై రోగులకు ప్రముఖ ఆర్థోపెడిక్స్ ఆంకాలజీ సర్జన్ డాక్టర్ రాజీవ్‌రెడ్డి (ఎముకల క్యాన్సర్ స్పెషలిస్ట్) సేవలు రోగులకు అందుబాటులో ఉంటాయని ఆయన చెప్పారు. ఇదిలా ఉంటే ఉదయం ఆస్పత్రికి విచ్చేసిన డాక్టర్ రాజీవ్ రెడ్డికి, విర్డ్ ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకర్ మొక్కను అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాజీవ్‌రెడ్డి ముగ్గురు రోగులను పరీక్షించి, అందులో ఒకరికి విజయవంతంగా శస్త్రచికిత్స నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి ట్రస్ట్ సభ్యుడు వి.నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్ర బాబు, సింధు, గాయత్రి తదితరులున్నారు.



విర్డ్ ఆస్పత్రికి విచ్చేసిన డాక్టర్ రాజీవ్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ట్రస్ట్ సభ్యుడు సుధాకర్

పురివిప్పే.. మనసు దోచే



పశ్చిమ ఏజెన్సీ ప్రాంతం కొండరెడ్డి గిరిజన గ్రామంలో శనివారం నెమలి పురివిప్పి నాట్యమాడింది. బుట్టాయగూడెం మండలంలోని లంకపాకల, అలివేరు గ్రామాలు అటవీ ప్రాంతానికి దగ్గరగా ఉంటాయి. కొద్ది రోజులుగా నెమలి ఆ గ్రామాల్లో సందడి చేస్తోంది. పురివిప్పి నాట్యం చేసి మళ్లీ అడవికి వెళ్లిపోతుంది. నెమలి నాట్యం చూస్తుంటే దాని సోయగానికి మంత్రముగ్ధులు కావాల్సిందే. –బుట్టాయగూడెం

కాల్వలో పడి వృద్ధురాలి మృతి

యలమంచిలి: పోడూరు పంచాయతీ కొత్తపేటకు చెందిన గొల్లమందుల గంగమ్మ(89) ప్రమాదవశాత్తు చించినాడ పంట కాల్వలో పడి మృతి చెందినట్లు ఎస్సై కర్ణీడి గుర్రయ్య తెలిపారు. గంగమ్మకు వయోభారంతో మతిస్థిమితం లేకుండా రోడ్డు మీద తిరుగుతూ ఉండేది. గంగమ్మ గురువారం కొత్తపేట వద్ద చించినాడ పంట కాల్వలో పడిపోయింది. ఎవరూ గమనించకపోవడంతో మృతదేహం యలమంచిలి మండలం పెనుమద్రు వద్దకు కొట్టుకువచ్చింది. గమనించిన మునిమవడు గొల్లమందులు సందీప్ శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. మృతదేహానికి శవ పంచనామా, పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై గుర్రయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

పెంటపాడు: ప్రత్తిపాడు జాతీయ రహదారిపై వాహనం ఢీకొట్టిన సంఘటనలో ఒక మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. పెంటపాడు ఎస్సై స్వామి తెలిపిన వివరాల ప్రకారం గూడెం మండలం కొండ్రుప్రోలు గ్రామానికి చెందిన జొన్నల అన్నవరపు సత్యనారాయణ, భార్య జొన్నల లక్ష్మి(55)తో కలిసి మోటార్‌సైకిల్‌పై దువ్వ బంధువుల ఇంటికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రత్తిపాడు జాతీయరహదారిపై వెనుక నుంచి వస్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ప్రమాదంలో లక్ష్మికి తీవ్రగాయాలు కావడంలో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త సత్యనారాయణకు స్వల్పగాయాలయ్యాయి. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

ఉప్పుటేరుకు ముప్పు



భీమవరం మండలం లోసరి వద్ద పూడుకుపోయిన ఉప్పటేరు



ఉప్పటేరు పూడికలో చేపలు, రొయ్యల చెరువులుగా మారిన దృశ్యం

- కరకట్టను ఆనుకుని చెరువులుగా మార్చేస్తున్న ఆక్వా మాఫియా
- స్పందించని ఇరిగేషన్ అధికారులు

భీమవరం అర్బన్ : ఉమ్మడి పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల మధ్య ఉన్న ప్రధాన డ్రెయిన్ ఉప్పుటేరు పూడుకుపోతుంది. దీంతో ఈ డ్రెయిన్ పరివాహక ప్రాంత ఆక్వా రైతులు కరకట్టను ఆనుకుని లోపలికి రొయ్యలు, చేపలు చెరువులు తవ్వేయడంతో డ్రెయిన్ కుచించుకుపోయింది. దీంతో వర్షాకాలంలో వరద ముంపు పరిస్థితులు ఏర్పడుతున్నాయి.

ఉప్పుటేరు కొల్లేరు నుంచి ఆకివీడు, కాళ్ల, భీమవరం మండలాల మీదుగా కృష్ణా జిల్లాలోని కృత్తివెన్ను మండలంలోని గొల్లపాలెంలో సముద్రంలో కలుస్తోంది. దీని ఆనుకుని సుమారు 80 వేల ఎకరాల్లో వరిసాగు, చేపలు, రొయ్యలు పెంపకం చేస్తున్నారు. అధికార యంత్రాంగానికి ఉప్పుటేరుపై దృష్టి లేకపోవడంతో వర్షాకాలంలో ఈ డ్రెయిన్ పొంగి పొర్లుతుంది. ఉప్పుటేరు పూడుకుపోవడంతో కొంతమంది అక్రమార్కులు కరకట్ట నుంచి సుమారు 400 మీటర్లు వరకు కబ్జా చేసి చేపలు, రొయ్యల పెంపకం చేస్తున్నారు. డ్రెయిన్ల శాఖ అధికారులు పట్టించుకోకపోవడంతో కొల్లేరుకు, ఉప్పుటేరు పరివాహక గ్రామాల్లో వరదలు వచ్చి వేలాది ఎకరాలు నీటి మునుగుతున్నాయి. సముద్రపు ఆటుపోటుతో ఈ ప్రాంత ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

అధికారులు, పాలకుల అశ్రద్ధ వల్లే..

కృష్ణా, పశ్చిమగోదావరి జిల్లాల సరిహద్దుగా ఉన్న ఉప్పుటేరు, కొల్లేరు పెద్దింట్లమ్మ ఆలయం సమీపంలో కొల్లేటి కోట జీరో మైలు రాయి వద్ద ప్రారంభమై ఆకివీడు, కాళ్ల, భీమవరం మీదుగా ప్రవహించి సముద్రంలో కలుస్తుంది. సముద్రం నుంచి వచ్చే ఆటుపోటులు ఎదుర్కొంటూ ఎగువ ప్రాంతంలో బుడమేరు, రామిలేరు, తమ్మిలేరుతో పాటు ఈ ప్రాంతంలో ఉండే ప్రధాన డ్రెయిన్లు మొగదిండి, న్యూ యనమదుర్రు, బొండాడ, పొలిమేరతిప్ప, పాత యనమదుర్రు, సాల్ట్ క్రీక్ వంటి డ్రెయిన్లలోని వరదనీటిని సముద్రానికి తరలిస్తుంది. అలాంటి ఉప్పుటేరుపై అధికారులు, పాలకులు సరైన దృష్టి లేకపోవడంతో పూడుకుపోతుంది. దీంతో వేలాది ఎకరాల్లో సన్న, చిన్నకారు రైతులు నష్టపోతున్నారు. ఈ డ్రెయిన్‌లో మూడు మీటర్లకు పైగా లోతు ఉండాల్సిన డ్రెయిన్ కొన్ని ప్రాంతాల్లో మీటర్ లోతుకు పూడుకుపోయింది.

వర్షాకాలంలో మరిన్ని ఇక్కట్లు

కొల్లేరు, మెట్ట ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాల కారణంగా జిల్లాలోని ప్రధాన డ్రెయిన్లన్నీ పొంగి పొర్లుతూ ఉప్పుటేరులో కలుస్తాయి. దీంతో ఉప్పుటేరు తన ఉగ్రరూపాన్ని దాల్చుతూ సముద్రం వైపు ప్రవహిస్తుంది. అదే సమయంలో సముద్రంలో ఏర్పడిన ఆటుపోటుల కారణంగా సముద్రపునీరు ఉప్పుటేరులోకి ఎగదన్నడం వల్ల ఎక్కడ నీరు అక్కడే నిలిచిపోతుంది. దీంతో ఉప్పుటేరు సమీపంలో ఉన్న గ్రామాలన్నీ నీట మునుగుతున్నాయి. ముందుచూపు లేకుండా అధికార యంత్రాంగం వ్యవహరించడం వల్ల అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది.

పూడికతీత ఎప్పుడు?

సుమారు మూడున్నర దశాబ్దాల క్రితం ఉప్పుటేరు పూడికతీత పనులు నిర్వహించారు. అప్పటి నుంచి ఇంత వరకు ఉప్పుటేరులో తవ్వకపోవడం వల్ల డ్రెయిన్ పూర్తిగా పూడుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఇదే పరిస్థితి కొనసాగితే వేలాది ఎకరాలు నీట మునగడంతో పాటు పరివాహక ప్రాంత గ్రామాలన్నీ ఉప్పుకయ్యలుగా మారే ప్రమాదం ఉందని జలవనరుల నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా సముద్ర ముఖద్వారం నుంచి ఉప్పుటేరు ఎగువ ప్రాంతం వరకు డ్రెడ్జింగ్ చేసి పూడిక పనులు చేపట్టాలని ఈ ప్రాంత ప్రజలతో పాటు నిపుణులు డిమాండ్ చేస్తున్నారు.

గత ప్రభుత్వంలో స్లూయిజ్ నిర్మాణానికి అనుమతులు

గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కొల్లేరు సరస్సు పరిరక్షణకు మూడు ప్రాంతాల్లో స్లూయిజ్‌ల నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. ఈ డ్రెయిన్‌కు మొగలో స్లూయిజ్ నిర్మిస్తే ఈ డ్రెయిన్ ఆనుకుని పంటపొలాలు, చేపల, రొయ్యల చెరువులు బాగుంటాయని ఈ ప్రాంత రైతులు చెబుతున్నారు. ఏటా జనవరి నుంచి జూన్ నెల వరకు సముద్రం నుంచి ఉప్పునీరు కొల్లేరు వరకు వెళ్లిపోవడంతో ఈ ప్రాంతం ఉప్పుకయ్యలుగా మారుతుంది. దీనికి స్లూయిజ్ నిర్మించడం వల్ల పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాల రైతులు లబ్ధి చేకూరుతుందని వ్యవసాయ నిపుణులు చెబుతున్నారు.

క్లుప్తంగా

వరాల వెంకన్న ఆలయానికి పోటెత్తిన భక్తులు



ఈడూరులో స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

అత్తిలి: భీష్మ ఏకాదశి పర్వదినం సందర్భంగా ఈడూరు గ్రామంలో వరాల వెంకటేశ్వర స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. వేకువ జామున స్వామివారికి సుప్రభాతసేవ, తోమాలసేవ, ఉదయం అర్చనలు జరిపారు. ఆలయ అర్చకులు వాడపల్లి శేఖరాచార్యులు ఆధ్వర్యంలో పూజాదికాలను నిర్వహించారు. ఈసందర్భంగా స్వామివారిని తులసిమాలలు, పలు రకాల పుష్పాలతో విశేషంగా అలంకరించారు. పరిసర గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో భక్తులు కాలినడకన హాజరై స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. హాజరైన భక్తులకు దాతల సహకారంతో అన్నదానం చేశారు.

కృష్ణ పరమాత్మకు పంచామృత అభిషేకాలు



విశేష అలంకరణలో కృష్ణ పరమాత్మ

తాడేపల్లిగూడెం (టీఓసీ): కృష్ణ యోగ ధ్యాన మందిరంలో శనివారం కృష్ణపరమాత్మకు పంచామృతాలతో అభిషేకాలు జరిగాయి. సహస్ర నామార్చనలు నిర్వహించారు. స్వామి వారికి పుష్పమాలలు, పట్టు వస్త్రాలతో అలంకరించారు. సామూహిక లక్ష తులసి పూజలు జరిగాయి. మందిర అధ్యక్షుడు కొర్లేపర పాండురంగారావు, కార్యదర్శి ఇందుకూరి మోహన్‌రాజులు పర్యవేక్షించారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు



బంగారుగూడెంలోని లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న ఆలయ కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని బంగారుగూడెం గ్రామంలో సువర్ణ లక్ష్మీనరసింహ స్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీష్మ ఏకాదశి, ఆలయ వార్షికోత్సవం సందర్భంగా సువర్ణ లక్ష్మీ నరసింహస్వామి వారి కల్యాణం కనుల పండువగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ సమయమంతుల శ్రీహరిరావు పర్యవేక్షణలో వార్షికోత్సవం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అఖండ అన్నసమారాధన నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు సమయమంతుల కాశీ, గట్టిం మాణిక్యాలరావు, సుందరం, ఆర్యవైశ్య సంఘ పెద్దలు పాల్గొన్నారు.

మేనరిక వివాహాలను ప్రోత్సహించవద్దు



ఇంటి వద్ద దివ్యాంగ విద్యార్థులకు శిక్షణ

తాడేపల్లిగూడెం (టీఓసీ): మేనరిక వివాహాలు ప్రోత్సహించవద్దని స్థానిక ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య అన్నారు. స్థానిక భవిత సెంటర్ ప్రత్యేక ఉపాధ్యాయుడు బాలీశ్వరయ్య మేనరిక వివాహాలు చేసుకోవడం వల్ల వారికి పుట్టే పిల్లలు విషయంలో అనర్థాలు సంభవించే అవకాశం ఉందని, అనర్థాలపై శనివారం భవిత పిల్లలు ఇంటి వద్ద తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. భవిత విద్యార్థులకు ప్రత్యేక విద్యను అందించారు. పిల్లల సామర్థ్యాలను బట్టి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. సమగ్ర శిక్ష ద్వారా అందజేస్తున్న పలు పథకాలు గురించి తెలిపారు. తల్లిదండ్రులు తప్పక పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఆకు కూరలతో సంపూర్ణ ఆరోగ్యం

పాలకొల్లు అర్బన్: గర్భిణులు, బాలింతలు ఎక్కువగా ఆకుకూరలతో వండి భోజనం తింటే రక్తహీనత సమస్యలు రావని ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ ఇందిర అన్నారు. పాలకొల్లు మండలం పెదమామిడిపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో శనివారం గర్భిణులు, బాలింతలకు ఆకుకూరల వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. కిచెన్ గార్డెన్‌ను పరిశీలించి మొక్కలు నాటారు. అనంతరం సేంద్రీయ విధానంలో సాగు చేసిన ఆకు కూరలను గర్భిణులకు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ ఎస్ఎన్ మల్లేశ్వరి, ఏఎన్ఎం ఎం.సుధారాణి, అంగన్‌వాడీ వర్కర్ జి.నాగజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రహదారులా ఇవి?

- నరకానికి నకళ్లుగా మారిన పట్టింపాలెం, అప్పారావుపేట రోడ్లు
- మండలంలో ప్రమాదభరితంగా మారిన వైనం
- ప్రధాన సెంటర్లన్నీ గోతులమయమే
- తరచూ ప్రమాదాలతో భయపడుతున్న వాహన చోదకులు
- ఉలుకు-పలుకు లేని అధికారులు, ప్రజాప్రతినిధులు

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం మండలంలోని పలు బీటీ రహదారులు అధ్వానంగా తయారయ్యాయి. ప్రధానంగా పట్టింపాలెం - అప్పారావుపేట, మాధవరం - జగన్నాథపురం గ్రామాల రహదారులపై మెటల్ చిప్స్ పైకి లేవడంతోపాటు పెద్ద పెద్ద గోతులు దర్శనమిస్తున్నాయి. వర్షాకాలం సమయంలో ఈ రహదారులు చెరువులను తలపిస్తున్నాయని స్థానికులు వాపోతున్నారు. పట్టింపాలెం - అప్పారావుపేట రహదారిపై వర్షాకాలం సమయంలో మనిషి లోతు నీటితో గుంతలు నిండిపోతున్నాయని, ఆ సమయంలో ప్రయాణిస్తే ఆ నీటిలో నుంచి వాహనాలు బయటకు వస్తాయో లేదో తెలియని పరిస్థితి నెలకొంటుందని పేర్కొంటున్నారు. ఇక మాధవరం-జగన్నాథపురం రహదారిపై ప్రయాణం ఒళ్లు హూనం కావడంతో పాటు వాహనాలు మరమ్మతులకు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉంటే చినతాడేపల్లి - బంగారుగూడెం రహదారిపై చినతాడేపల్లి, నీలాద్రిపురం, కొమ్ముగూడెం, పట్టింపాలెం గ్రామాల మధ్య పలు చోట్ల రహదారి గుంతలు మయంగా మారింది. ప్యాచ్ వర్కులకు నోచుకోవడం లేదు. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు స్పందించి ప్యాచ్ వర్కులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.



పట్టింపాలెం మలుపు వద్ద ఇలా



పట్టింపాలెం - అప్పారావుపేట రహదారిపై ఏర్పడిన గోతులు



తాడేపల్లిగూడెం మండలం మాధవరం - జగన్నాథపురం రహదారి దుస్థితి

జగ్గన్నపేటలో కనకదుర్గాదేవి విగ్రహ ప్రతిష్ఠ



మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణకు వేదాశీస్సులు అందజేస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో చెరువు గట్టున నూతనంగా నిర్మించిన కనకదుర్గాదేవి, గణపతి, నాగబంధ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచి ప్రత్యేక హోమాలు జరిపారు. అమ్మవారిని మాజీ డిప్యూటీ సీఎం కొట్టు సత్యనారాయణ, ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్, టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల బాబ్జీలు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి వేద పండితులు వేదాశీస్సులు అందజేశారు. గ్రామస్తులతో పాటు ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న గ్రామ ఆడపడుచులు గ్రామానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. దీంతో గ్రామంలోని ఏ ఇల్లు చూసినా బంధువులు, ఆడపడుచులతో కళకళలాడింది. అనంతరం అఖండ అన్నసమారాధన నిర్వహించారు. వైఎస్సార్ సీపీ నాయకులు ములగాల రాంబాబు, తుమ్మల నాగరాజు, పత్స లక్ష్మణరావు, ఉప సర్పంచ్ కూనపాముల చింతయ్య, సర్వశుద్ధి అప్పారావు, పత్స బ్రహ్మయ్య, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు విరివిగా పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు.

ఘనంగా గ్రామోత్సవం



కల్యాణ వెంకటేశ్వరస్వామి విగ్రహాలను ఊరేగిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని కుంచనపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీదేవీ, భూదేవి, సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతిష్ఠించనున్న విగ్రహాలను శనివారం ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి ఊరేగించారు. కుంచనపల్లి, పాతూరు, కేఎన్ రోడ్డు, ఎస్వీఆర్ సర్కిల్ మీదుగా తిరిగి తాలూకాఫీస్ సెంటర్ నుంచి కుంచనపల్లి గ్రామానికి చేరుకున్నాయి. స్వామి, అమ్మవార్ల విగ్రహాలకు భక్తులు సాదర స్వాగతం పలికారు. ఆలయ ట్రస్ట్ కమిటీ చైర్మన్ దాసరి మల్లిఖార్జునరావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు ఆత్కూరి వీరవెంకట పవన్ కుమార్, కామేశ్వరరావు, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



తణుకులో నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

తణుకు అర్బన్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ పేద ప్రజలకు వ్యతిరేకంగాను, కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ.ప్రతాప్ విమర్శించారు. శనివారం స్థానిక బ్యాంక్ కాలనీలో సీఐటీయూ ఆధ్వర్యంలో బడ్జెట్ ప్రతులను దగ్ధం చేసి నిరసన తెలిపారు. పేదలపై భారాలు వేసే బడ్జెట్ వ్యతిరేకించండి, లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, కార్మికులకు కనీస వేతనం రూ. 26వేలు అమలు చేయాలని, రైతు వ్యతిరేక చట్టాలు రద్దు చేయాలని, స్వామినాథన్ కమిషన్ సిఫార్సులు అమలు చేయాలని, సంక్షేమ పథకాలకు నిధులు పెంచాలని పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ప్రతాప్ మాట్లాడుతూ మోదీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి వచ్చినా ఎప్పటి మాదిరిగానే ఈ బడ్జెట్ కూడా కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గార రంగారావు, గుబ్బల గోపి, శ్రీనివాస్, బాబు, మురళి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

మార్చి 15 నుంచి నాటిక పోటీలు



పాలకొల్లు కళాపరిషత్ నాటిక పోటీల కరపత్రం విడుదల చేస్తున్న సంస్థ సభ్యులు

పాలకొల్లు అర్బన్: పంచారామ క్షేత్రంగా ప్రసిద్ధి చెందిన పాలకొల్లులో నాటక పరిషత్‌లు గత ఆరు దశాబ్దాలుగా నాటిక పోటీలు నిర్వహిస్తూ నాటక రంగానికి ఎనలేని సేవలు అందించాయని కళా పరిషత్ అధ్యక్షుడు కేవీ కృష్ణవర్మ అన్నారు. పాలకొల్లు కళా పరిషత్ నాటిక పోటీలు మార్చి 15, 16, 17 తేదీల్లో నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ పోటీలకు సంబంధించిన కరపత్రాన్ని శనివారం విడుదల చేశారు. నాటిక పోటీలు బస్టాండ్ సెంటర్‌లో అడబాల థియేటర్స్ వెనుక ఖాళీ స్థలంలో ప్రత్యేక వేదిక ఏర్పాటు చేసి నిర్వహిస్తున్నామని వివరించారు. ఆవిష్కరించిన కరపత్రాలను మొదటగా కళాపరిషత్ గౌరవ అధ్యక్షుడు మేడికొండ శ్రీనివాస చౌదరి, ఉపాధ్యక్షుడు డా.కేఎస్‌పీఎన్ వర్మకు అందజేశారు. కళా పరిషత్ తరఫున గత 16 సంవత్సరాలుగా నాటిక పోటీలు నిర్వహిస్తున్నామని, దీనికి సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. సంస్థ ప్రధాన కార్యదర్శి మానాపురం సత్యనారాయణ, కార్యదర్శి జక్కంపూడి కుమార్, కోశాధికారి కొణిజేటి గుప్త పాల్గొన్నారు.

ఐదో తరగతిలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం



బి.రాజారావు, ప్రిన్సిపల్

తాడేపల్లిగూడెం రూరల్: మండలంలోని పెదతాడేపల్లి డాక్టర్ బీఆర్. అంబేడ్కర్ గురుకులంలో ఐదో తరగతి ప్రవేశానికి ఆన్‌లైన్ దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపల్ బి.రాజారావు తెలిపారు. శనివారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మార్చి 6వ తేది లోపు విద్యార్థులు మీ-సేవా ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఏప్రియల్ 6వ తేదిన ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారన్నారు. ఇతర వివరాలకు విద్యార్థి స్టడీ సర్టిఫికెట్‌తో సమీపంలోని గురుకులాన్ని సంప్రదించాలని సూచించారు.

బీజేపీ విజయంపై హర్షం

తాడేపల్లిగూడెం (టీఓసీ): ఢిల్లీ శాసన సభ ఎన్నికలలో బీజేపీ విజయం సాధించడం పట్ల ఆ పార్టీ నాయకులు శనివారం శ్రీకృష్ణదేవరాయలు విగ్రహం వద్ద విజయోత్సవాలు నిర్వహించారు. స్వీట్లు పంచారు. ఢిల్లీ ప్రజలు నరేంద్ర మోదీ పరిపాలన దక్షత మీద విశ్వాసం ఉంచి బీజేపీకి విజయాన్ని అందించారన్నారు. ఈ సందర్భంగా బీజేపీ అధిష్ఠానానికి, విజయానికి కారణమైన కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. అసెంబ్లీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, పట్టణ అధ్యక్షుడు దువ్వ శ్రీను, జిల్లా ఉపాధ్యక్షుడు కొండపల్లి నగేష్, కోకన్వీనర్ రామగాని సత్యనారాయణ, నాయకులు వీఆర్‌వీఎల్ నారాయణ, వెంకటేశ్వరరావు, కంచర్ల రాజా, శిరిగినీడి పాండురంగారావు, పడాల కావ్య రెడ్డి, గంటా వెంకట లక్ష్మి, లక్ష్మీ, దుర్గ, యలిశెట్టి జయప్రకాశ్ చిక్కాల చిరంజీవి, సాయిబాబా పాల్గొన్నారు.

రక్తదానం ప్రాణదానంతో సమానం

అత్తిలి: రక్తదానం ప్రాణదానంతో సమానమని పలువురు వక్తలు తెలిపారు. స్థానిక ఎస్వీఎస్ఎస్ డిగ్రీకళాశాలలో లియోక్లబ్, లయన్స్‌క్లబ్ ఆఫ్ అత్తిలి సంయుక్త ఆధ్వర్యంలో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈశిబిరంలో విద్యార్థులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల పాలకవర్గ కార్యదర్శి మద్దాల వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్ పి రామశర్మ, లయన్స్‌క్లబ్ సభ్యులు దాసం బాబ్జి, యాతం రాంబాబు, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డీవీ రమణమూర్తి, సాయిరాం తదితరులు పాల్గొన్నారు.

కేశవస్వామి దర్శనానికి పోటెత్తిన భక్తులు





కేశవస్వామి ఆలయంలో విశేషాలంకరణలో స్వామివారు, దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు

తణుకు అర్బన్: భీష్మ ఏకాదశి మహోత్సవం సందర్భంగా శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి దర్శనం కోసం భక్తులు పోటెత్తారు. ఉదయం స్వామి, అమ్మవార్లకు గోస్తనీ నది స్నానాల అనంతరం అభిషేకాలు నిర్వహించి పూలు, తులసీదళాలతో ప్రత్యేక అలంకరణ చేశారు. స్వామివారిని దర్శించుకునేందుకు తణుకు పట్టణ నలుమూలల నుంచి భక్తులు అధికసంఖ్యలో ఆలయానికి తరలి రావడంతో ఆలయ ప్రాంతం కిక్కిరిసిపోయింది. దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులు క్యూలైన్‌లో వెళ్లి స్వామి, అమ్మవార్లను దర్శించుకునేలా అన్ని ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం 2 గంటలకు స్వామివారి రథోత్సవం అత్యంత వైభవంగా జరిపారు. ఉదయం 10.30 గంటల నుంచి ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి వెంకట సుబ్బారావు ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధికసంఖ్యలో హాజరై స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. ఆలయ ఈవో ముత్యాల సత్యనారాయణ భక్తుల సౌకర్యార్థం చేసిన ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శివరాత్రి పనులు ప్రారంభం



శివాలయంలో శివరాత్రి పనులు ప్రారంభిస్తున్న ఎంపీపీ శ్రీహరినారాయణరాజు

ఉండి: ఈ నెల 26న జరిగే మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఉండి రాజులపేట శివాలయంలో పనులు ప్రారంభించినట్లు ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు తెలిపారు. శనివారం రాజులపేటలోని పార్వతీసమేత మల్లికార్జునస్వామి ఆలయంలో వేదపండితుడు,శివరాత్రి ఉత్సవ ఆర్గనైజర్ ఎస్.చలతపతిరావు వేదమంత్రాల నడుమ పందిరి రాట నాటి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతిఏటా మాదిరి ఉత్సవాలనలు వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా పెద్దల ఆధ్వర్యంలో సూచనలు, సలహాలను తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓ రంగరాజు, అర్చకులు సన్నిధిరాజు శేషగిరి తదితరులు పాల్గొన్నారు.

రథోత్సవంలో అపశ్రుతి



ఆచంటలో డ్రెయినేజీలోకి ఒరిగిన రథం

పెనుగొండ: భీష్మ ఏకాదశి సందర్భంగా ఆచంటలో శనివారం నిర్వహించిన రథోత్సవంలో అపశ్రుతి చోటు చేసుకుంది. రథచక్ర సీల విరిగిపోవడంతో వెళ్తున్న రథం అదుపు తప్పి డ్రెయినేజీలోకి ఒరిగిపోయింది. ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో ఊపిరి పీల్చుకున్నారు. అనంతరం రథాన్ని పైకి లాగి రథోత్సవం యథావిధిగా కొనసాగించారు. శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి అంతర్వేద ఏకాదశి పురస్కరించుకొని స్వామివారి కల్యాణ మహోత్సవం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం స్వామి వారిని రథంపై ఊరేగించారు. రథోత్సవ కార్యక్రమంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఆచంట ఎస్సై కె.వెంకటరమణ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు నిర్వహించారు.

బాధిత విద్యార్థికి సాయం

పాలకొల్లు అర్బన్: పట్టణంలోని జీవీఎస్వీఆర్ఎం మునిసిపల్ ప్రాథమిక పాఠశాలలో రెండో తరగతి చదువుతున్న ఎస్.కుశాల్ ఈశ్వర్ బోగి మంటల్లో పడి తీవ్ర గాయాల పాలై భీమవరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతున్నారు. ఈనేపథ్యంలో పాఠశాల హెచ్ఎం రాయపూడి భవానీ ప్రసాద్ ప్రోత్సాహంతో మానస సరోవర్ సొసైటీ తరఫున రూ.10 వేలు విరాళాన్ని బాధిత విద్యార్థి తండ్రి దుర్గారావుకి శనివారం అందజేశారు.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల వెల్లువ

- తణుకు ఎక్సైజ్ శాఖ పరిధిలో 5 మద్యం దుకాణాలు
- గడువు తీరే సమయానికి 123 దరఖాస్తులు
- మద్యంపై దరఖాస్తులపై రూ. 2.46 కోట్ల ఆదాయం



తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ కార్యాలయం

తణుకు అర్బన్: ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కల్లుగీత వర్గాలకు ఇవ్వనున్న మద్యం దుకాణాలకు దరఖాస్తులు వెల్లువెత్తాయి. తణుకు ఎక్సైజ్‌శాఖ పరిధిలో కేటాయింపబడ్డ 5 మద్యం దుకాణాలకుగాను శనివారం సాయంత్రం 5 గంటలకు గడువు సమయం దాటిన తరువాత 123 దరఖాస్తులు దాఖలయ్యాయి. గతనెల 27నుంచి ఈ నెల 8వతేదీ వరకు దరఖాస్తులు దాఖలు చేసుకునే విధంగా ఎక్సైజ్ శాఖ వెసులుబాటుఇచ్చింది. కల్లుగీతవర్గాలకు కేటాయించిన 5 మద్యం దుకాణాలకు సంబంధించి తణుకు పట్టణ పరిధిలో శెట్టిబలిజ, తణుకు రూరల్ శెట్టిబలిజ, ఇరగవరం గౌడ, పెనుగొండ శెట్టిబలిజ, పెనుమంట్ర గౌడ సామాజిక వర్గాలకు ముందుగానే నిర్దేశించి దరఖాస్తులను ఆహ్వానించారు. అయితే ఎక్సైజ్ శాఖ ముందుగానే దరఖాస్తు రుసుము నునాన్ రిఫండబుల్‌గా రూ. 2లక్షలు చొప్పున వసూలు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఈలెక్కన ఇప్పటివరకు వచ్చిన 123 దరఖాస్తులకు సంబంధించి రూ.2.46 కోట్లు మద్యం దరఖాస్తులపై ప్రభుత్వానికి ఆదాయం సమకూరింది. ఈనెల 10వ తేదీ న భీమవరం జిల్లా కలెక్టరు సమక్షంలో మద్యం దుకాణాలకు లాటరీ తీయనున్నారు.

ఎక్సైజ్ కార్యాలయానికి వచ్చిన మద్యం దరఖాస్తుల వివరాలిలా..

తణుకు (శెట్టిబలిజ)	22
తణుకు రూరల్ (శెట్టిబలిజ)	34
ఇరగవరం (గౌడ)	35
పెనుగొండ (శెట్టిబలిజ)	11
పెనుమంట్ర (గౌడ)	21

కల్లుగీత వర్గాలను వ్యాపారం చేయనిస్తారా?

గత ప్రభుత్వ హయాంలో మద్యాన్ని ప్రభుత్వ దుకాణాల ఏర్పాటుతో అమ్మకాలు జరిపి మద్యంపై నియంత్రణ చేయగలిగింది. కానీ కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రైవేటు మద్యం దుకాణాలకు తెరతీసి 24 గంటలు మద్యం విక్రయాలు జరిపి అంగడిలో సరుకు మాదిరిగా మార్చేసింది. అంతేకాకుండా మద్యం దుకాణాలపై రాజకీయ ముద్ర కూడా ఉండడంతో వ్యాపారులు సైతం తలలు పట్టుకున్నారు. ప్రభుత్వం ముందుగా చెప్పిన ప్రకారం మద్యం అమ్మకాల్లో కమిషన్‌ను చెల్లించకపోవడంతో వ్యాపారులు సైతం గొల్లుమంటున్నారు. ఇక రాజకీయ ప్రసన్నం వంటి కార్యక్రమాలు పూర్తయిన తరువాత మిగిలిన ఆదాయంతో సరిపెట్టుకోవాల్సిన దుస్థితి వ్యాపారుల్లో ఉంది. ఈ నేపథ్యంలో అసలు కల్లుగీత వర్గాలకు దుకాణాలు కేటాయింపులు చేస్తారా.. ఒకవేళ లక్కీడిప్‌లో తగిలినా ఆయా వర్గాలను వ్యాపారాలు చేయనిస్తారా.. అనేది ప్రశ్నార్థకంగా మిగిలింది. ఇప్పటికే ఇతర పార్టీలకు చెందిన నాయకులకు వచ్చిన మద్యం దుకాణాలను బలవంతంగా తీసుకోవడం, ఇష్టంలేని వారికి ఒక రేటు కట్టి తీసుకోమనడం లేని పక్షంలో బెదిరింపు ధోరణి పరిస్థితుల్లో తాజాగా కల్లుగీత వర్గాలను ఏమేరకు వ్యాపారం చేయనిస్తారో వేచిచూడాల్సిందే.

123 దరఖాస్తులు వచ్చాయి



తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ పరిధిలో కల్లుగీత వర్గాలకు కేటాయించబడ్డ 5 మద్యం దుకాణాలకు సంబంధించి మొత్తం 123 దరఖాస్తులు అందాయి. దరఖాస్తులకు సంబంధించి నిబంధనల ప్రకారం డీడీలు తీశారా అనేటటువంటి పరిశీలన చేయాల్సి ఉంది. ఈ దరఖాస్తులకు సంబంధించి ఈనెల 10వ తేదీన భీమవరంలో జిల్లా కలెక్టరు సమక్షంలో డ్రా తీయనున్నారు.

– సత్తి మణికంఠరెడ్డి, సీఐ, తణుకు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ